## క్లుప్తంగా

### 24న హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్ వేడుకలు

**తెనాలి:** హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ -ఏపీ ఐసీ-03 జోన్ ఆధ్వర్యంలో, ఈనెల 24న రూరల్ మండలగ్రామం కొలకలూరులోని ఆశ్రమంలో జరగనున్న వేడుకల్లో అభ్యాసులంతా పాల్గొనాలని ఆ సంస్థ జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్.రామకోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 1945లో హార్ట్ ఫుల్‌నెస్ సంస్థను స్థాపించిన పూజ్యశ్రీ బాబూ జీ మహరాజ్ (షాజహాన్ పూర్, యూపీకి చెందిన శ్రీ రామచంద్ర) 125వ జయంతిని పురస్కరించుకుని ఈ సంవత్సరం పొడవునా ప్రపంచవ్యాప్త అభ్యాసులు వారి వారి ఆశ్రమాల్లో వేడుకలు జరుపుతున్నట్టు తెలియజేశారు. ఇదే సందర్భంగా ఈ జోన్ పరిధిలోని అభ్యాసులందరూ 24న కొలకలూరు జోనల్ ఆశ్రమంలో రోజంతా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పచ్చని పరిసరాలు, స్వచ్ఛమైన వాతావరణంలో అభ్యాసులందరూ ధ్యానించి, సంస్థకు చెందిన మాస్టర్, మిషన్, మెథడ్ విశేషాలపై మరింత అవగాహనను పెంచుకోవాలని సూచించారు. వేడుకలు ఉదయం 7:30 కి ప్రారంభమై, సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వివరించారు.

### వంటపాత్రల పంపిణీ



**తెనాలి:** రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొమ్మమూరు కాల్వకట్టపై నివసిస్తున్న సంచార జాతులకు చెందిన 50 కుటుంబాలకు శుక్రవారం స్టీలు వంటపాత్రలు పంపిణీ చేశారు. ఐఆర్‌టీఎస్ అధికారి భరత్‌భూషణ్-నళిని దంపతుల పెళ్లిరోజు, గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేమ్‌రాజు సతీమణి జ్యోత్స్న జన్మదినం రోజున ఈ సేవా కార్యక్రమాన్ని చేశారు. యడ్లపల్లి రవికిరణ్, సుద్దపల్లి మురళీధర్, కరుణా నిలయం ప్రార్థనమందిరం పాస్టర్ ఎం.చంద్రబాబు, కోడూరి మోజెస్, మంచికలపూడి వెంకటేశ్వరరావు, పొన్నెకంటి చక్రవర్తి, సుద్దపల్లి ఫణిధర్, శీలం వినియకుమార్, సుద్దపల్లి అంబేడ్కర్, కంభం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### బ్యూలా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సేవలు

**తెనాలి:** పేద పిల్లలకు ఆర్థిక సాయం, స్కూలు పిల్లలకు బుక్స్, మెటీరియల్స్, బస్టాండు, రైల్వే స్టేషన్, మురికివాడల్లోని అనాధలకు భోజనం పంపిణీ లాంటి పలు సేవలను అందిస్తున్న బ్యూలా మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు పిల్లలకు రకరకాల బహుమతులు అందజేశారు. వందలాది మందికి భోజనం పెట్టారు. దైవసేవకులు పలువురు పాల్గొని వాక్యసందేశాలను ఇచ్చారు. పలువురు పెద్దలకు సత్కారం చేశారు. ఆరాధ్య ఏంజెల్ తొలి జన్మదిన వేడుక సందర్భంగా ఈ కార్యక్రమాలను జరిపారు. భానుప్రసాద్, ప్రభుదాస్, జాన్‌బాబు వాక్యసందేశం ఇచ్చిన వారిలో ఉన్నారు.

### 26న ఛలో గుంటూరుకు తరలిరావాలి



**తెనాలి:** కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26వ తేదీన గుంటూ రులో జరగనున్న భారీ ర్యాలీ, సభను జయప్రదం చేయాలని సీఐటీయూ, తెనాలి డివిజన్ కమిటీ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, బాబూప్రసాద్ విజ్ఞప్తిచేశారు. బ్రూవరీస్ ముఠా వర్కర్స్, అగ్రికల్చరల్ ముఠా వర్కర్స్, డాల్ మిల్ ముఠా వర్కర్స్ పని ప్రదేశాల్లో శుక్ర వారం గ్రూపు సమావేశాలను జరిపి కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందని, కార్మిక సంఘం పెట్టుకునే అవకాశమున్నా, కార్మిక సంఘాలు పనిచేసే అవకాశం లేదని, కార్మికులు కట్టు బానిసలుగా బ్రతకాల్సిన పరిస్థితులు రాబోతున్నాయని తెలిపారు. ఈ విధానాలను సమైక్యంగా త్రిప్పి కొట్టాలని కార్మికులను కోరారు. గుంటూరు ర్యాలీకి వందలాదిగా తరలిరావాలని కోరారు.

### కిటికీ రెక్కపడి విద్యార్థికి తీవ్ర గాయాలు

**తెనాలిరూరల్:** కిటికీ రెక్క ఊడి పడడంతో విద్యార్థి తీవ్ర గాయాలపాలైన ఘటన తెనాలిలో శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ గంగానమ్మపేట నుండి జయప్రకాష్‌నగర్‌కు వెళ్లే మార్గంలోని ప్రైవేటు స్కూలులో ఐదో అంతస్తు నుండి కిటికీ రెక్క శుక్రవారం సాయంత్ర ఊడి పడింది. ఇది పాఠశాలలోని ఓ విద్యార్థి మీద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. ప్రస్తుతం ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాల ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

---



తెనాలిలో..

# పెరుగుతున్న నేరాలు

## ఇటీవలి కాలంలో అధికమైన చైన్ స్నాచింగ్‌లు, చోరీలు

**తెనాలిరూరల్:** ప్రశాంతతకు పేరుగా చెప్పుకునే తెనాలిలో నేరాలు పెరిగిపోతున్నాయి. వరుస చోరీలు, చైన్ స్నీచింగ్ ఘటనలు ప్రజలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఒంటరిగా ఉంటున్న వృద్ధ మహిళలు, రోడ్డుపై వెళ్తున్న వృద్ధులే టార్గెట్‌గా చైన్ స్నాచింగ్‌లు జరుగుతున్నాయి. యథావిధిగా తాళం వేసి ఉన్న ఇళ్లు గుల్లవుతున్నాయి.


- పట్టణ మారీస్‌పేట రావి వారి వీధి-2కు చెందిన సుగ్గుల సరస్వతి అద్దెకు ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇద్దరు యువకులు స్కూటీపై వెంబడించారు. ఇంటి వద్దకు వచ్చిన ఆమెను అడ్రస్ అడుగుతూ ఆమెను మాటల్లో పెట్టి మెడలోని బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యారు.
- నందివెలుగుకు చెందిన ఓ ప్రముఖుడు ఈ నెల 16వ తేదీ సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో తెనాలి నుండి గ్రామానికి వెళ్లేందుకు మార్కెట్ వంతెన సమీపంలో ఆటో ఎక్కాడు. అప్పటికే ఆటోలో ముగ్గురు యువకులు ఉన్నారు. వీఎస్సార్ కళాశాల సమీపంలోకి వెళ్లగానే ఆర్టీవో అధికారులు వాహనాలను తనిఖీ చేస్తున్నారంటూ డ్రైవర్ పక్కన కూర్చున్న వ్యక్తిని వెనక్కి పంపారు. ఇరుకుగా కూర్చున్న నందివెలుగుకు చెందిన వ్యక్తి ఆదమరచేలా చేసి అతని మెడలో ఉన్న బంగారు గొలుసు, జేబులోని నగదును అపహరించారు. ఇంటికి వెళ్లి చేసుకోగా నగదు గొలుసు లేక పోడంతో తిరిగి తెనాలి వచ్చి పోలీసులను ఆశ్రయించాడు.



18న వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కుని వెళుతున్న దుండగులు (ఫైల్)

- పట్టణ నాజరుపేటకు చెందిన వెచ్చా సుజయలక్ష్మి ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేయగా ఒంటరిగా ఉంటోంది. ఇల్లు అద్దెకు కావాలంటూ అక్టోబర్ 26న సాయంత్రం గుర్తు తెలియని మహిళ ఒకరు సుజయలక్ష్మి ఇంటికి వచ్చింది. మాటలు కలిపి అదును చూసి మెడలోని గొలుసు లాక్కు వెళ్లింది.

- జులై 16న తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో పురాతన దేవాలయమైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో భారీ చోరీ జరిగింది. అర్ధరాత్రి దాటాక ఆలయంలోకి చొరబడిన దుండగులు గర్భాలయ తాళాలు, గడిపగలగొట్టి అమ్మ వారి విలువైన ఆభరణాలను చోరీ చేశారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారి విగ్రహంపై ఉన్న నాలుగు బంగారు అభయహస్తాలు, పాదాలు, బంగారు కళ్ళు, మంగళ సూత్రాలు, బొట్టు అపహరించుకు వెళ్లారు. అనంతరం గర్భాలయంలో మల్లేశ్వర స్వామి వారి నాగాభరణాలు, పానపట్టం వంటి సుమారు రూ. పది లక్షల విలువ చేసే వెండి ఆభరణాలు అపహరణకు యత్నించారు కానీ వాటిని మోయలేక ఆలయ ఆవరణలోనే వదిలేసి వెళ్లారు. అమ్మవారి ఆభరణాలు మాత్రం తీసుకెళ్లారు.



జులై 16న పెదరావూరులో అమ్మవారి ఆభరణాలను తొలగించిన దృశ్యం (ఫైల్)

- ఆగస్టు 16న తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన షేక్‌నసీమా, కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్రించారు. అర్ధరాత్రి దాటాక లేచి చూడగా ఇంట్లోని బీరువా తెరచి ఉండి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలను నమోదు చేశారు. ఐదు సవర్ల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని నసీమా పోలీసులకు తెలిపింది.

పైవన్నీ ఇటీవలి కాలంలో జరిగిన కొన్ని ఘటనలు మాత్రమే. ఇవే కాక పోలీసులు నమోదు చేయని / పోలీసుల దృష్టికి వెళ్లని చోరీలు చైన్‌స్నాచింగ్ ఘటనలు జరుగుతున్నాయని తెలుస్తోంది. నేరాలు పెరుగుతూనే ఉండడంతో వాటి నియంత్రణకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

---

## 26న జరిగే ప్రదర్శన విజయవంతం చేయండి

**కొల్లిపర:** రాష్ట్రంలో రైతులకు కనీస మద్దతు ధర, కార్మికులకు కనీస వేతనం కోసం ఈనెల 26న గుంటూరులో జరిగే ప్రదర్శన లో రైతులు, కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. మండలంలోని వల్లభాపురం , మున్నంగి, కొల్లిపరలో శుక్రవారం రైతులను కలసి ప్రదర్శన కు చెందిన కరపత్రాలు రైతులకు సాంబిరెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పంటలకు సరైన మద్దతు ధరలు లేనందున రైతాంగానికి ఏటా సుమారు రూ.3 లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని, డాక్టర్ స్వామినాధన్ కమిషన్ సిపార్సులను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూను కోవడం లేదన్నారు. రైతులు, పేదలకు భారం కలిగించే ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి, పగల కొట్టండని చెప్పిన కూటమి నాయకులు బలవంతంగా బిగించడాన్ని వ్యతిరేకించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను మార్చు కోవాలని హెచ్చరించేందు 26న గుంటూరులో జరిగే ప్రదర్శనకు రైతులు, కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో లంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి, వంగా శివారెడ్డి, కొండా సాంబిరెడ్డి, కేసరి మాధవరెడ్డి, కొండా లక్ష్మారెడ్డి, లంకిరెడ్డి సుధాకరరెడ్డి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

## గ్రంథాలయాల్లో ఎక్కువ సమయం గడపండి

**తెనాలిఅర్బన్:** ఖాళీ సమయాన్ని గ్రంథాలయాల్లో గడపడం వలన విద్యార్థినీలో జ్ఞానం పెంపొందుతుందని విశ్రాంత ఉపాధ్యాయులు పొన్నపల్లి గోపాల కృష్ణమూర్తి, జెఎంజె కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీలు పేర్కొన్నారు. 54వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను జెఎంజె కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వకాలంలో పేద విద్యార్థులు చదువుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పుస్తక పఠనం, అందరూ అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సి.హెచ్.విశ్రాంతమ్మ, జనమ్మ, విశ్రాంతమ్మ, షకీనా, గ్రంథాలయాధికారులు యు.రాంబాబు, కె.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

## రేపు వైఖానస సేవా సంఘం కార్తిక వన సమారాధన

**తెనాలి:** శ్రీవైఖానస సేవాసంఘం, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చెంచుపేట సుల్తానాబాద్‌లోని శ్రీరామకృష్ణ మనోహర్ ఆశ్రమం ప్రాంగణంలో కార్తీక వనసమారాధన జరుగుతుందని సంఘ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం ఎనిమిదిన్నర గంటలకు సత్యనారాయణస్వామి వ్రతం, లక్ష్మీ ధాత్రి పూజ అనంతరం విష్ణు సహస్రనామ స్తోత్రపారాయణ, శ్రీ విఖనసచార్య స్వామి స్తోత్ర పారాయణ జరుగుతాయని తెలిపారు. అనంతరం సేవా సంఘానికి అనుబంధంగా ఏర్పడిన యువ వైఖానస అసోసియేట్స్ సభ్యుల ప్రత్యేక సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక ఉంటాయన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే సభా కార్యక్రమంలో తిరుపతి రాష్ట్రీయ విద్యాపీఠంలో సంస్కృతం ఎంఏలో ప్రథమునిగా ఉపరాష్ట్రపతిచే అయిదు గోల్డ్ మెడల్స్ సాధించిన రొంపిచర్ల యశ్వంత్ దీక్షితులును సత్కరిస్తామన్నారు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఓఎస్‌డీ వేదాంతం శ్రీనివాసమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు వుంటాయనీ, వైఖానస సంఘీయులు కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు.

## ఎన్‌పీసీఐ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

**రేపల్లె రూరల్:** నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఆధార్ మ్యాపర్ క్యాంప్‌లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె పోస్టల్ కార్యాలయ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు తెలిపారు. పట్టణంలోని నేతాజీనగర్, కూరగాయల మార్కెట్, పీర్ల పంజా, 1వ వార్డు ఎస్టీ కాలనీలోని సచివాయంలో ఏర్పాటు చేసిన ఎన్‌పీసీఐ స్పెషల్ క్యాంప్‌లను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. నగదు బదిలీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు సంబంధించిన లబ్ధిని పొందాలంటే ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్ అనుసంధాన ప్రక్రియ తప్పనిసరి అని చెప్పారు. పోస్టల్ శాఖ ద్వారా కేవలం రూ.200తో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంవో నరేంద్ర, పోస్ట్‌మాస్టర్‌లు, ఏబీపీలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియకు సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులు

## బిర్సా ముండా జయంతి వారోత్సవాలు

**చావలి(వేమూరు):** బ్రిటిష్ వారి బానిస విధానాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ధైర్య సాహసాలను ప్రదర్శించిన మహనీయుడు బిర్సా ముండా అని మండల విద్యాశాఖాధికారి రోజ్లాండ్ అన్నారు. వేమూరు మండలంలోని చావలి మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బిర్సా ముండా జయంతి వారోత్సవాలలో ఆమె పాల్గొని మాట్లాడుతూ బిర్సా ముండా గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన నాయకునిగా బ్రిటిష్ వారిని గడ గడలాడించిన ధీరుడు, భరతమాత ముద్ద బిడ్డ అని అన్నారు. ప్రతి ఏడాది నవంబర్ 22వ తేదీ నుంచి బిర్సా ముండా వారోత్సవాలు నిర్వహించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### శ్రీశరణాగతి గోష్టిచే శ్రీధనుర్మాసవ్రత దీక్ష



**తెనాలి:** పట్టణానికి చెందిన శ్రీశరణాగతి గోష్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీనరేంద్ర రామానుజదాస స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ధనుర్మాసవ్రత ప్రయుక్త శ్రీకృష్ణ దీక్షా మహోత్సవం నిర్వహించనున్నారు. త్రిదండి చినజీయర్‌స్వామి మంగళాశాసనాలతో డిసెంబరు 16వ తేదీనుంచి జనవరి 13వ తేదీ వరకు ఆర్టీసీ బస్‌స్టేషను నుంచి వీఎస్సార్ కాలేజి రోడ్డులో యర్రంశెట్టి గంగాధర్, యర్రంశెట్టి రమేష్‌బాబు స్థలప్రాంగణంలో ఈ వేడుకలు జరుగుతాయి. సంబంధిత కరపత్రాన్ని శుక్రవారం శ్రీశరణాగతి గోష్టి కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. పెనుగొండ వెంకటేశ్వరరావు, తన్నీరు సీతారామయ్య, బండారు వాసుబాబు, విష్ణుమొలకల శ్యాంసుందరబాబు, విష్ణుమొలకల విజయలక్ష్మి, తన్నీరు శివశంకర్, ఈదర కోటేశ్వరరావు, సోమరౌతు నాగేంద్రం, వాకా విజయలక్ష్మి, వెలివెల శరత్, పట్టెల అరుణ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మల్లేశ్వరునికి లక్ష బిల్వార్చన

**భట్టిప్రోలు:** భట్టిప్రోలులో కొలువైన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (రథం గుడి) దేవస్థాన వంశ పారంపర్య ట్రస్టీ కొడాలి శంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాచాబత్తుని వంశీయులచే లక్ష బిల్వార్చన మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి మారేడు దళాలతో లక్ష బిల్వార్చన, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాచాబత్తుని వంశీయులైన ఓం ప్రకాష్-నాగజ్యోతి, శివనాగరాజు-మాలతి, రుద్ర పశుపతిరావు-కనకదుర్గ, ధనప్రసాద్-దివ్య, చిరంజీవి-లీలాభవాని, షణ్ముఖశంకర్-సుప్రియ దంపతులు పాల్గొన్నారు. అంతకు ముందు స్వామి వారికి ప్రభాత సంకీర్తన, మారేడు దళాలకు భజన సమాజం ఆధ్వర్యంలో సంకీర్తనలతో గ్రామోత్సవం నిర్వహించారు. పూజ కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి జ్యోతిర్లింగార్చన, అఖండజ్యోతి దీపారాధన, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచన కార్యక్రమాలు జరిపారు.



### బాలికలు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలి

**చందోలు(కర్లపాలెం):** కిశోర బాలికలు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి చెప్పారు. చందోలు నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికా వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో కొన్ని చోట్ల మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చూస్తున్నామని బాలికలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. బాల్య వివాహాలను బాలికలు ధైర్యంగా ఎదిరించాలని చక్కగా చదుకోవాలని తెలిపారు. లీగల్ అడ్వైజర్ మౌనిక మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైందని అనవసర విషయాలపై దృష్టి పెట్టకుండా చదువుపై ఏకాగ్రత కలిగి ఉండాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించటంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీప్రియ, సీడబ్ల్యూ సుకన్యకుమారి, మహిళా పోలీసులు శివమ్మ, లక్ష్మి, శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

---

## హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ చేయరా?

### సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్

**తెనాలిఅర్బన్:** ప్రభుత్వం హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించింది. కానీ సచివాలయ ఉద్యోగులు కొందరూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడం లేదు. ఇది మంచి పద్ధతి కాదంటూ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగానమ్మపేట భవనంవారి వీధిలోని సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జియో ట్యాగింగ్ విధులకు వెళ్లకుండా ఉద్యోగులు అక్కడ ఉండటాన్ని గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించి సర్వేను వేగవంతం చేయాలని, లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.



ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ శేషన్న

## తెనాలి సుందరీకరణకు సహకరించండి

**తెనాలిఅర్బన్:** పట్టణ సుందరీకరణకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 17,18 వార్డులలో శుక్రవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచలను చేశారు. ఇస్లాంపేటలో రోడ్ల విస్తీర్ణం తక్కువగా ఉండటం వలన కాల్వలు చిన్నవిగా ఉన్నాయని చెప్పారు. వాటిని ప్రతి రోజు శుభ్రం చేయాలని సూచించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, కౌన్సిలర్ అన్నం పిన్నారావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



కాల్వను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ పిన్నారావు

## జిల్లా వైద్యశాలలో పర్యటించిన సీడీసీ బృందం

**తెనాలిఅర్బన్:** సెంటర్స్ ఫర్ డీసీజ్ కంట్రోల్ (సీడీసీ) బృందం తెనాలి జిల్లా వైద్యశాలలో శుక్రవారం పర్యటించింది. జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 2,143 మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం జరిగిందని, అందులో ఇద్దరికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు అధికారులు తెలిపారు. అలాగే వైద్యశాలలోని పలు విభాగాలను వారు పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీడీసీ జాతీయ డిప్యూటీ డైరెక్టర్ లౌరీ ఫుల్లర్, ల్యాబ్ అడ్వయిజర్ డాక్టర్ రాజీవ్ శర్మ, కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, షేక్ ఇండియా అధికారులు లోకేష్, మహేష్‌కుమార్, డాక్టర్ మహా లింగం, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, వివిధ విభాగాల మెడికల్ ఆఫీసర్‌లు డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహ, డాక్టర్ హరిణి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా వైద్యశాల అధికారులతో సీడీసీ బృందం

## నిర్మల్ హృదయ్‌లోకి మతిస్థితిమితం లేని వృద్ధురాలు

**తెనాలి:** మతిస్థిమితం లేకుండా ఒంటరిగా సంచరిస్తున్న అంజమ్మ అనే వృద్ధురాలిని గుంటూరులోని నిర్మల్ హృదయ్ (మిషనరీస్ ఆఫ్ ఛారిటీ) అక్కున చేర్చుకుంది. శుక్రవారం రాత్రి తెనాలి వచ్చిన నిర్మల్ హృదయ్ ప్రతినిధులకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు అంజమ్మను అప్పగించారు. వృద్ధురాలిని తమ సంరక్షణలో ఉంచుకుని తగిన వైద్యం, ఆహారం అందిస్తామని చెప్పారు. తమతో గుంటూరుకు తీసుకెళ్లారు. పట్టణ చినరావూరుకు చెందినట్టుగా భావిస్తున్న అంజమ్మ అనే వృద్ధురాలిని మూడురోజుల క్రితం ఎవరో తీసుకొచ్చి, స్థానిక మార్కెట్ వంతెన సమీపంలోని బస్‌షెల్టర్ వద్ద వదిలేశారు. తన పేరు అంజమ్మగా చెప్పటం మినహా మరే వివరాలనూ చెప్పలేకపోతోంది. సమాచారం తెలిసిన హెల్పింగ్ సోల్జర్స్ ప్రతినిధి ఇనయ్‌తుల్లా, మిత్రబృందం ఆమెకు దుస్తులు, ఆహారం ఇస్తూ వచ్చారు. ఆమె దీనస్థితిని గమనించిన కొందరు అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు నిర్మల్ హృదయ్‌ను సంప్రదించారు. దీంతో వారు ఇక్కడకు వచ్చారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ కేహెచ్ నిర్మల, మెప్మా సీఎంఎం విజయ కుమారి ప్రభృతులు ఆ వృద్ధురాలిని నిర్మల్ హృదయ్ ప్రతినిధులకు అప్పగించారు.



నిర్మల్ హృదయ్ ప్రతినిధులతో అధికారులు

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

**తెనాలిరూరల్:** తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు తమ విధులను శుక్రవారం బహిష్కరించారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లాలోని హోసూరు పట్టణంలో న్యాయవాది కణ్ణన్‌ను దుండగుడు దారుణంగా హత్య చేయడం, విశాఖ జిల్లాలో న్యాయ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటలను నిరసిస్తూ విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ, న్యాయవాదులపై దాడులు, అత్యాచారాలు జరగడం బాధాకరమన్నారు. ఇటువంటి దారుణాలను ఖండిస్తున్నామని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, వైస్ ప్రెసిడెంట్ అన్నం పిన్నారావు, కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు మందలపు వేణుగోపాలరావు, తాడిబోయిన శ్రీనివాసరావు, గుమ్మడి రవిరాజు, ప్రభావతి, శారద, పుణ్యవతి, కోర్టు గుమస్తాలు పాల్గొన్నారు. న్యాయవాది కణ్ణన్ మృతికి సంతాపం తెలియజేస్తూ నివాళులర్పించారు.



కోర్టు వెలుపల నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

## 26న జరిగే ధర్నాలను జయప్రదం చేద్దాం

రైతు కూలీ సంఘం (ఆం.ప్ర)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు

**తెనాలి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ, కార్మిక, గిరిజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఈనెల 26న జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన అఖిల భారత పిలుపుతో ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన, కార్మిక, వృత్తి సంఘాల సమన్వయ సమితి, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ అనుబంధ సంఘాల జాయింట్ కమిటీల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరుగుతుందని తెలిపారు.. విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చాలోని రైతుకూలీ సంఘం ( ఆం.ప్ర), ఏఐఎఫ్‌టీయూ ( న్యూ) కోరుతున్నట్టు తెలియజేశారు. స్వామినాధన్ కమీషన్ సిఫార్సు చేసిన విధంగా అన్ని రకాల పంట ఖర్చుల పైన అదనంగా 50 శాతం పెంచి చట్టబద్దతతో మద్దతు ధరలు ప్రకటించాలనీ, కౌలు రైతుల చట్టంలో భ యజమాని సంతకం ఉండాలన్న నిబంధన తొలగించాలనీ, పంట నష్టం, ధరల పతనం, రుణభారంతో లక్షలాది రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో రైతులకు బ్యాంకులు ఇచ్చిన పంట రుణాలు రద్దు చేయాలనీ. కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ల అనుకూల నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలనీ. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలనీ, రైతుల, పేదల పాలిట ఉరితాడు కాగల ఎలక్ట్రికల్ బిల్లును ఉపసంహరించాలి...ఇంకా అనేక డిమాండ్లపై ఆందోళన జరుగుతుందని వివరించారు.